**ANNQUEST December 2014**

**ISSN: 2321-3043**

**www.stannsannquest.com**

## స్త్రీ - సాంఘికన్యాయము-మనుస్మృతి,కౌండిన్యస్మృతుల యొక్క తులనాత్మక అధ్యయనము

**డా. కె. ప్రభావతి**

సనాతనకాలమునుండి స్త్రీ యొక్క స్థితిగతులు వివిధ రూపాలని సంతరించుకొనుచున్నవి. స్త్రీ విద్య, హక్కులు, వివాహవిషయములందు మహర్షులు వివిధ నియమాలను రూపొందించిరి. అవి స్త్రీకి సమ్మతమైనా కాకపోయినా మనువు మొదలుకొని ఆధునిక సంస్కృత పండితుడు పుల్లెల
శ్రీ రామచంద్రుడుగారి వరకూ తమకు తోచినరీతిలో స్త్రీ జీవితంపై దిశానిర్దేశము చేయుచునే ఉన్నారు.

ఈ పత్రము నందు మనువు, పరాశరుడు రచించిన మనుస్మృతి, పరాశరస్మృతి, శ్రీ రామచంద్రుడుగారు రచించిన కౌండిన్యస్మృతిని తులనాత్మకంగా పరిశీలించటం జరిగినది. స్మృతికాలము 500 బి. సి. నుండి 1000 బి.సి. వరకూ చెప్పటం జరిగినది. పుల్లెల శ్రీ రామచంద్రుడుగారు ఈ యుగమునకు చెందిన వారు. కనుక సనాతన మహర్షుల ఆలోచనలు, ఆధునిక పురుషుల భావాలు తులనాత్మకంగా పరిశీలించటం జరిగినది.

**విద్య** - ప్రాచీనకాలమందు, స్త్రీ స్థితిగతులు, ఆమెకున్న అధికారాలు, వాటి ఆచరణను బట్టి నిర్ణయింపబడినది (1). స్త్రీ పురుష తేడా లేకుండా వేదవిద్య అందరికి అందుబాటులో ఉన్నట్లుగా, స్త్రీ వేదవిద్యను అభ్యసించినట్లుగా అనేక ఆధారాలు కలవు. 'వాచా', 'విశ్వవరా', 'అపాలా', 'ఘోషా', 'గోధా', 'లోపాముద్రా', 'శశ్వతీ', 'రోమషా', ముదలగువారు అనేక మంత్రాలను రూపొందించారు. ఋగ్వేదము నందలి ఎనిమిదవ అధ్యాయము అపాలకు చెందినదిగా పేర్కొనబడినది(2). ఆధునిక కాలమందు స్త్రీలందరు పఠించెడు 'దేవీసూక్తము' వాచా రచించినదే (3). వైదిక విద్య పన్నెండేండ్లు నిరంతరాయంగా, నియమబద్ధంగా నేర్వవలసినది. ఉపనయనముతోనే వేదవిద్య ప్రారంభించబడును. పదవ సంవత్సరముతో విద్య ఇరవైరెండేండ్లు వరకూ కొనసాగెడిది. కాని కాలక్రమాంతరమున స్త్రీ వివాహవయస్సు పదునారు సంవత్సరములుగా నిర్ణయించటంతో వేదవిద్య పూర్తిచెయ్యటం అనేది గగనమయ్యెను. కనుక కొందరు వేదవిద్య కొరకు సన్యాసినులుగా, బుద్ధునికాలమందు భిక్షుకిలుగా మారారు. భర్త మరణానంతరం గూడా స్త్రీలు వేదవిద్యనభ్యసించి ఆధ్యాత్మిక ఉన్నతిని పొందిరి.

---

సంస్కృత విభాగము సెంట్ ఆన్స్ మహిళా కళాశాల హైదరాబాదు

prabhavathi.kothakapa@gmail.com
>

ANNQUEST

**अस्मिंश्च त्यागे स्त्रीयोऽधिक्रियन्ते ('भिक्षुकि' इत्यनेन स्त्रीणामदि प्राग् विवाहाद्वा वैधव्यादूर्ध्वं वा संन्यासे अधिकारः अस्तीति दर्शितम्, तेन भिक्षाचर्यं, मोक्ष शास्त्रश्रवणम्, ऐकान्ते आतध्यानं च ताभिः कर्तव्यम्, त्रिदण्डादिकं धार्यम्, इति मोक्षधर्मे चतुर्धरीतिकायां सुलभाजनकसवादे) (4) జీవన్ముక్తి వివేకం - పేజి- 24**

ఈ పరిస్థితి ఉపనిషత్తుల కాలము వరకూ జరిగినది. స్మృతికాలము ప్రారంభమయ్యే నాటికి స్త్రీ వివాహవయస్సును మరింత తగ్గించుకొంటూ పోవటం జరిగినది. మనువు ప్రత్యేకంగా వివాహవయస్సును నిర్దేశించనప్పటికీ వివాహమే ఉపనయనసంస్కారమని చెప్పెను.(5) ఉపనయనసంస్కారము పదేండ్లలో చెయ్యాలి. కాబట్టి ఆ వయస్సుకు వివాహము జరిపించినచో రెండూ కలిసిపోతాయని మనువు భావించి ఉండవచ్చును. కనుక వేదవిద్య స్త్రీకి గగనమయ్యెను. పరాశరుడు గూడా స్త్రీకి విద్య అవసరమని ఎక్కడా పేర్కొనలేదు. కాని కౌండిన్యస్మృతికారుడు, పుల్లెల శ్రీరామచంద్రుడు గారు మాత్రము స్త్రీకి యిష్టమున్నచో ఉపనయనము చేయవచ్చని, లేనిచో మానవచ్చని స్త్రీకి పూర్తి స్వేచ్ఛనిచ్చెను.(6) స్త్రీ మామూలు విద్యనే గాదు తనని, తనవాళ్ళను రక్షించుకొనుటకు ఆయుధాలు చేతబట్టి అస్త్రవిద్య గూడా అభ్యసించవలెనని నిర్దేశించెను (7). మనువు, పరాశరుడు ఆ కాలానికనుగుణంగా విద్య కన్నా వివాహానికి ఎక్కువ ప్రాధాన్యమునిచ్చిరి.

**వివాహము** : మనువు స్త్రీల వివాహ విషయమున న్యాయముగానే నిర్ణయములు తీసుకొన్నట్టుగా కనబడును. మనువు కన్యాశుల్కమును వ్యతిరేకించెను. మరియు ఎవరూ కన్యాశుల్కమును తీసుకొని వివాహము చేసినట్టుగా తాను వినలేదని గూడా పేర్కొనెను. (8). కన్యాశుల్కమును తీసుకొన్నచో ఆ కన్యను అమ్ముకొన్నట్లేనని చెప్పెను. వివాహ విషయమునందు ప్రతివారు తమతమ వర్ణాలను జాగ్రత్తగా కాపాడవలెనని చెప్పెను. సమస్త కులములవారు తమ తమ భార్యలను జాగ్రత్తగా చూచుకొనవలెనని నొక్కి వక్కాణించెను.

**చతుర్ణామపి వర్ణానాం దారా రక్ష్యత మాస్సదా ।** (9)

కాని ప్రేమ వివాహములను మనువు తప్పుబట్టలేదు. తమకంటే ఉత్తమజాతికి చెందిన పురుషుని వలచిపోయిన కన్యను శిక్షించగూడదని చెప్పెను. అదే మనువు, తనకంటే తక్కువ జాతి పురుషుని వలచి పోయిన కన్యను కామమంతా పోవునట్లు ఇంట్లోనే నిర్బంధించవలెనని చెప్పెను. ఇటువంటివి మనము ప్రస్తుత కాలములో చూస్తూనే ఉన్నాము.

**కన్యాం భజంతీముత్కృష్టం న కించిదపి దాపయేత్ ।**

**జఘన్యం సేవమానాం తు సంయతాం వాసయేత్ గృహే II (10)**

మనువు విడాకుల విషయాలలో గూడా స్త్రీకి న్యాయము చేసెననియే చెప్పవలెను. భార్య తనను యిష్టపడకపోతే ఒక సంవత్సరము వరకు భర్త వేచి చూడాలి. ఆ తరువాత గూడా ఆమె తనను ఇష్టపడకపోతే తాను వివాహసమయమున యిచ్చిన వస్త్రాభరణములను తీసుకొని, ఆమెను పంపించి వేయవచ్చని చెప్పెను. వివాహవిషయమున మనువు స్త్రీలకు చాలా స్వాతంత్ర్యము నిచ్చెను మరియు న్యాయమును కూడా చేసెను. స్త్రీ తన మొదటి భర్తతో సుఖంగా ఉండలేక అతనిని వదలి రెండవవానికి భార్యగాపోయి, అతనికి ఏదైనా రోగం వచ్చినచో, ఆమె మళ్ళీ మొదటి భర్త వద్దకు రావచ్చును అని, ఆమె మొదటి భర్త ఆమెను మంత్రములతో సంస్కరించి స్వీకరంప వచ్చును అని చెప్పెను. (11).

ఇది ఈ ఆధునిక యుగంలో చాలా అరుదుగా జరిగే విషయము. మరియు, తండ్రి తమకు వివాహము చేయకపోతే తమంతట తాము తమకు యోగ్యులైన వారిని వివాహము చేసికొంటే, పెద్దవారిని ధిక్కరించినారను పాపము స్త్రీకి గాని పురుషునికిగాని కలగదు.

**అదీయమానా భర్తారమధి గచ్ఛేద్యది స్వయమ్I**

**నైనఃకించి దవాప్నోతి నచ యంసాధిగచ్ఛతి II ( 12)**

కాని మనువు కన్నా ముందు పదహారేళ్ళ కన్యను ఇరవై రెండేండ్ల వరుడు వివాహము చేసికొనగా, మనువు ముప్పై సంవత్సరాల వరుడు పన్నెండేళ్ళ కన్యను వివాహము చేసికొనవచ్చునని, అట్లే ఇరువై నాలుగేళ్ళ వాడు ఎనిమిదేళ్ళ కన్యను వివాహము చేసికొనవచ్చునని చెప్పెను.(13). మానసిక పరిపక్వత లేని కన్యను సంపూర్ణ పరిపక్వత నొందిన వరుడికిచ్చి వివాహము చేయటం అనే విషయంలో మనువు స్త్రీకి అన్యాయమే చేసెనని భావించవచ్చును.

పరాశరమహర్షి గూడా పన్నెండు సంవత్సరాలుగా స్త్రీ వివాహవయస్సును నిర్ణయించెను. పన్నెండు సంవత్సరాలు వచ్చినా తండ్రి తన కూతురికి వివాహము చేయకపోతే నరకానికి పోవునని నొక్కివక్కాణించెను. (14). పరాశరమహర్షి గూడా పునర్వివాహమును అనుమతించెను. మాటామంతి అయిన తరువాత వరుడు కనిపించకుండా పోయినప్పుడు, భర్త చనిపోయినప్పుడు, చాలాకాలము వరకు యితర దేశాలకు పోయినప్పుడు, నపుంసకుడైనచో, భర్త పతితుడైనచో ఆ స్త్రీ పునర్వివాహము చేసుకునవచ్చునని చెప్పెను. (15).

మనువు ఎచ్చట సతీసహగమనమును పేర్కొనలేదు. కాని పరాశరమహర్షి దానిని ప్రోత్సహించెను. (16).మనువు యిచ్చిన స్వాతంత్ర్యము పరాశరడు యివ్వలేదని చెప్పవచ్చును. మనువు గర్భస్రావమును గూర్చి ఎచ్చట పేర్కొనలేదు. కాని పరాశరస్మృతి కలియుగధర్మశాస్త్రముగా పేర్కొనినది. కావున ఆనాటికి స్త్రీలు తమకిష్టం లేకున్నచో గర్భస్రావమును చేయించుకొనెడివారని ఆ స్మృతిగ్రంధము ద్వారా తెలియుచున్నది.

ANNQUEST

కాని పరాశరమహర్షి గ్భస్రావమును చేయించుకున్న స్త్రీలను వదిలిపేయవలెనని నిర్దేశించెను.(17).

కౌండిన్యకారుడు కన్యాశుల్కమును గాని, వరకట్నమును గాని పాపకార్యముగా తీసుకొన్నవాళ్ళను పాపాత్ములుగా వర్ణించెను.

**శ్వశురాద్యో ధనం గృహణాత్యసౌ పాపో నరాధిప: I**

**విక్రీణాతి సుతాం యశ్చ శుల్కార్థం సోऽధమాధమ: II (18)**

మన సనాతన ధర్మము వివాహబంధానికి అతిప్రాముఖ్యత నిచ్చెను. విడాకుల విషయములో కౌండిన్యస్మృతికారుడు ఈ ఆధునిక కాలమునకనుగుణంగా సలహాలనిచ్చెను. వివాహబంధమనేది స్త్రీ పురుషుల కిరువురికి అత్యంత ప్రాధాన్యమైన విషయమని చెప్పెను. ఇద్దరు సంసారానికి రెండు చక్రాలవంటి వారని చెప్పెను. ( 19). చిన్నచిన్న విషయములకు వివాహబంధమును ఛేదనం చేయుట తగదని పేర్కొనెను. దానివలన సంఘములోను, కుటుంబములోను, అలజడి చెలరేగునని భావించెను.

**పున: పునర్వివాహస్య చ్ఛేద: క్షుద్రేణ హేతునా I**

**వినాశాయ కుటుంబస్య సమాజస్యాప్యశాంతయే II (20)**

రెండు మూడు సంవత్సరముల వివాహబంధము వలన జన్మించిన పిల్లలు, ఆ బంధం విచ్ఛిన్నమైనచో సంఘముయొక్క అలజడికి కారణమగుదురని అభిప్రాయపడెను. (21). కనుక

శ్రీ రామచంద్రుడుగారు విడాకులను ప్రోత్సహించలేదు. అహంకారము వలన గానీ, చపలత్వమువలన గానీ, చెడు ప్రవర్తన వలనగానీ వివాహబంధమును ఛేదించిన వారు వృద్ధాప్యమున అనేక సమస్యలనెదుర్కొనుదురని చెప్పిరి.

**కాయేన దురహంకృత్యా వివాహం చాపలేన వా I**

**ఛిన్దతాం వార్ధకేऽనన్తా భవేత్ క్లేశపరంపరా II (22)**

శ్రీ రామచంద్రుడుగారు బహుభార్యత్వమును బహుభర్తృత్వమును ఖండించెను. (23)

మనువు వైదిక యజ్ఞకార్యాలకొరకు పురుషుడు, భార్య చనిపోయిన తరువాత మళ్ళీ వివాహం చేసుకొన వచ్చునని తెలిపెను. కాని ఆధునిక కాలములో వైదికకార్యములు ఎవ్వరూ అధికముగా చేయుట లేదు కావున పురుషునికి, పునర్వివాహము అవసరము లేదని శ్రీ రామచంద్రుడుగారు చెప్పిరి. స్త్రీకి పునర్వివాహమును ప్రోత్సహించెను. చిన్నవయసులో భర్త చనిపోయినచో స్త్రీ మళ్ళీ వివాహము చేసుకొనవచ్చునని చెప్పెను. (24).

**హక్కులు** : స్త్రీకి స్త్రీ ధనమనేది ఉండాలని మనకు పరాశరస్మృతి, మనుస్మృతి ద్వారా ఆవగతమగును. మనువు స్త్రీ ధనమును ఆరువిధములుగా పేర్కొనెను. అధ్యగ్ని, ఆవాహనికం, భర్తృదత్తం, తల్లి, సోదరులు, తండ్రి యిచ్చినది. తల్లి చనిపోతే, ఆ తల్లి ఆస్తికి ఆమె పుత్రులు, పెండ్లియైన కూతురు యొక్క కుమారులు,

తండ్రి ఆస్తికి వలె హక్కుదారులు. కూతురి కూతుళ్ళకు గూడా అమ్మమ్మగారి ఆస్తి నుండి మర్యాదకు దగినట్లుగా కొంత ధనమును పొందు హక్కు కలదు.

**జనన్యాం సంస్థితాయాం తు సమం సర్వే సహోదరా: I**

**భజే రన్మాతృకం భగిన్యశ్చ సనాభయ: II ( 25)**

వివాహానంతరము భర్త సంతోషంతో యిచ్చినది గూడా స్త్రీ ధనమే అగును. సంతతి లేకుండా చనిపోయిన స్త్రీ ధనమంతా భర్తకే చెందును. ఈ విధంగా మనువు స్త్రీలకు తప్పని సరిగా కొంత ధనము ఉండవలెనని నొక్కి వక్కాణించెను. మరియు స్త్రీల వ్యవహారాల్లో స్త్రీలే సాక్షులుగా ఉండాలని కూడా చెప్పెను. (26). పురుషాధిక్య సంఘము కావున మనువు స్త్రీల విషయములలో అధిక శ్రద్ధ కనబరచెను. తండ్రి ఆస్తిని పంచుకొన్న అన్నదమ్ములు తమ తమ పాళ్ళ నుండి పెండ్లిగాని ఆడపిల్లలకు వేరువేరుగా నాల్గవభాగము నివ్వవలెనని చెప్పెను. (27).మనువు కొన్ని విషయములలో స్త్రీని కాపాడుట కొరకు తీవ్రమైన నిర్ణయములు చేసెను. తమ కూతురికి పెండ్లి చేసిన తరువాత ఆ స్త్రీకి సంబంధించిన ధనాన్ని, వాహనాలను, వస్త్రాలను, తల్లితండ్రులు కాని, ఆ స్త్రీ యొక్క బంధువులు కాని ఉపయోగించుకొంటే వారు పాపం పొంది అధోగతి పాలగుదురని చెప్పెను.(28) మనువు స్త్రీకి ఎన్నొ హక్కులు, అధికారములనిచ్చి గౌరవించెను.

**యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా: I**

**యత్రైతాస్తు న పూజ్యంతే సర్వాస్తత్రాఫలా: క్రియా: II ( 29)**

స్త్రీలు దు:ఖించినచో ఆమె దు:ఖమునకు కారణమైన వంశమంతా నాశనమగునని చెప్పెను. తమ మేలుగోరువారు ఆమెకు ఆభరణములు, వస్త్రములు, చక్కని భోజనమునిచ్చి ఆమెను సంతోషపెట్టవలెను గాని ఆమె అవమానపాలైనచో ఆ వంశమంతా నాశనమగునని మనువు ఆమెకు అత్యధిక హోదాని ప్రసాదించెను (30). నిస్సంతానవతి అయిన స్త్రీని అందరూ చులకనగా చూచెదరు. కాని ఆధునిక కౌండిన్యస్మృతికారుడు సంతానోత్పత్తికి స్త్రీనే అపరాధిగా చేయవలసిన అవసరం లేదు, అది న్యాయము కాదని చెప్పెను.

**వ్యభిచారాద్యకృత్యేషు దోషే స్త్రిపుంసయో: సమే I**

**స్త్రీయ ఏవ వినిన్ద్యన్తే కిమన్యాయ్యమత: పరమ్ II (31)**

మనువు స్త్రీలను ఆదరంగా గౌరవంగా చూసినప్పటికి శ్రీ రామచంద్రుడిగారి వలె స్త్రీపురుషులిద్దరు అన్ని విషయాలలో సమానమేనని మాత్రము చెప్పలేదు. శ్రీ రామచంద్రుడుగారు స్త్రీ శరీరము రక్తము, మలము, మజ్జతో నిర్మింపబడినచో పురుషుని శరీరము మాత్రము బంగారము, తేనెతో నిర్మింపబడెనా ? అని ప్రశ్నించెను. (32) మానభంగం జరిపిన స్త్రీల విషయములో మన ప్రాచీన మహర్షులు అత్యంత న్యాయంగా ప్రవర్తించారనిపించును. కోరిక లేని కన్యను బలవంతంగా చెరచిన పురుషునికి మరణదండన విధించవలెనని

మనువు చెప్పెను.

**యోకామం దూషయేత్కన్యాం స సద్యోవధమర్హతి** (33)

శ్రీ రామచంద్రుడుగారు గూడా దీనిని సమర్థించెను. కాని అనవసరంగా అభియోగం మోపిన స్త్రీని  కఠినంగా శిక్షించాలని గూడా చెప్పెను.

**దండనీయ: ప్రకురుతే యోऽకామం పరమోషితమ I**
**నారీ మిథ్యాభియోక్త్రీ చ దండనీయా సుదుర్మతి: II (34)**

పరాశరమహర్షి గూడ బలాత్కరింపబడిన స్త్రీకి చాలా మినహాయింపులిచ్చెను. స్త్రీని కొట్టి, భయపెట్టి, కట్టివేసి, బందీగా చేసి బలాత్కారంగా అనుభవించినచో ఆ స్త్రీ ఆకృచ్ఛసాంతపనమనెడి వ్రతము చేసినచో పరిశుద్ధురాలగునని తెలిపెను. అట్లే స్త్రీకి యిష్టమున్నా లేకపోయినా పాపాత్ముడైన పురుషుడు ఆమెను బలాత్కారంగా ఒక్కసారి అనుభవించినచో ఆమె ప్రజాపత్యమను వ్రతమును చేసి రజస్వల అయి తరువాత పరిశుద్ధమగునని తెలిపెను (35). ఈ కాలంలో ఈ మినహాయింపులేవి? పురుషునికి కఠినమైన శిక్షలు అమలుచేయవలెనని స్త్రీలోకం ఎలుగెత్తి అరుచుచున్నది తప్ప బలాత్కరింపబడిన స్త్రీలను అంగీకరించగలిగే అత్తలు, అమ్మలు ఉన్నారా ?కనుక స్త్రీకి స్త్రీయే శత్రువు.

కౌండిన్యస్మృతికారుడు కూడా పరాశరునితో ఈ విషయములో ఏకీభవించెను.

**అనిచ్ఛంన్తీ తు యా నారీ బలాత్కారేణ దూషితా I**
**రాజోదర్శనత: పశ్చాత్ విశుద్ధ్యతి న సంశయ:  II ( 36)**

ఆస్తి హక్కుల విషయములో కూడా శ్రీ రామచంద్రుగారు స్త్రీపురుష భేదం లేకుండా తండ్రి ఆస్తి, భార్య, కొడుకు, కూతురు అందరికీ సమానభాగంగా యివ్వవలెనని చెప్పెను. (37)

మనువు, పరాశరుడు పురుషాధిక్య ప్రపంచములో స్త్రీకి అనేక విషయములో న్యాయము చేసినప్పటికి, స్త్రీ పురుషులిరువురు మంచి, చెడ్డ విషయములో సమానమని మాత్రము చెప్పలేదు. ఆ విధమైన సమానత్వము కౌండిన్యస్మృతిలోనే మనకు కనబడును.

## FOOT NOTES

1) Eminent Indian Women - page -28

2) Rugveda - 8.91

3) Rugveda - 10.125

4) జీవన్ముక్తి వివేకము - -పుట 24

5) వైవాహికో విధి: స్త్రీణాం సంస్కారోవైదికస్మృత:

పతిసేవా గురౌవాసో గృహార్థోऽగ్ని పరిక్రియా - -మనుస్మృతి 2.67

6) పురాయుగేऽధునా కాల ఇతి భేద: కుతోన్వయమ్

అద్యాపి మౌఞ్జి భంధాది నారీణామస్తు తత్ స్పృహమ్ - -కౌండిన్యస్మృతి 159

7) స్త్రియో రక్షేయురాత్మానమాత్మీయాంశ్చ విపదగణాత్

తస్మాశ్చస్త్ర చ శస్త్ర చ నైపుణీం ప్రాప్నుయు: భ్రుశమ్ - -కౌండిన్యస్మృతి 161

8) నానుశుశ్రుమ జ్ఞాత్వేతత్పూర్వేష్వపి హి జన్మసు

శుల్క సంజ్ఞేన మూలేన చ్ఛన్నం దుహిత్రు విక్రయమ్ - -మనుస్మృతి 9.100

9) మనుస్మృతి - 8.359

10) మనుస్మృతి - 8.365

11) మనుస్మృతి - 9.176

12) మనుస్మృతి - 9.91

13) త్రిం శద్వర్షో వ్హేత్కన్యాం హృద్యాం ద్వాదశ వార్షికీమ్

త్ర్యష్ట వర్షోऽష్టవర్షాం వాధర్మేసీదతి సత్వర: - - మనుస్మృతి 9.94

14) పరాశరస్మృతి - 7.8

15) పరాశరస్మృతి - 4.30

16) పరాశరస్మృతి - 4.32

17) పరాశరస్మృతి - 4.20

18) కౌండిన్యస్పృతి - 177

19) కౌండిన్యస్పృతి - 184

20) కౌండిన్యస్పృతి - 186

21) కౌండిన్యస్పృతి -187

22) కౌండిన్యస్పృతి -188

23) కౌండిన్యస్పృతి -191

ANNQUEST

24) కౌండిన్యస్మృతి -199

25) మనుస్మృతి - 9,192,193,194,195,196

26) మనుస్మృతి - 8.68

27) మనుస్మృతి - 9.118

28) మనుస్మృతి - 3.52

29) మనుస్మృతి - 3.56

30) మనుస్మృతి - 3.57 to 59

31) కౌండిన్యస్మృతి - 166

32) కౌండిన్యస్మృతి- 168

33) మనుస్మృతి - 8.364

34) కౌండిన్యస్మృతి - 162

35) పరాశరస్మృతి - 10.26,27

36) కౌండిన్యస్మృతి - 173

37) కౌండిన్యస్మృతి - 182

ANNQUEST